సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు

కేసీ గుప్తా చిత్రపటానికి పూలమాల వేస్తున్న క్లబ్ చైర్మన్ రవి చంద్రన్

ధర్మారం,సెప్టెంబర్1:సేవా కార్యక్రమాలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ చైర్మన్ రవి చంద్రన్ అన్నారు. వాసవి క్లబ్ వ్యవస్థాపకుడు కేసీ గుప్తా జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని మహాలక్ష్మీ దవాఖానలో ఆదివారం క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ చైర్మన్ సిరిపురం సత్యనారాయణతో కలిసి గుప్తా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. రక్తదాతలను అభినందించారు. వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. పలువురు ఉపాధ్యాయులు, పాత్రికేయులను సన్మానించారు. ఈ సందర్భంగా రవిచంద్రన్ మాట్లాడారు. క్లబ్ ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ చైర్మన్ సిరిపురం సత్యనారాయణ సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారని ఆయన కొనియాడారు. అనంతరం బ్రిలియంట్ మోడల్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సత్యనారాయణ జన్మదిన వేడుకలకు రవిచంద్రన్ హాజరయ్యారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా గవర్నర్ జంధ్యం మాధవి,ధర్మారం వాసవి క్లబ్ అధ్యక్షుడు తాటిపల్లి వంశీ, ప్రధాన కార్యదర్శి మల్యాల శివ, కోశాధికారి ఈగం ప్రసాద్, సభ్యులు సిరిపురం శరత్ చంద్ర,బీరెల్లి రాము,ఎలగందుల అశోక్,మల్యాల శ్రీనివాస్,గడ్డం శ్రీనివాస్,కొల్లూరి కిషోర్,ముక్త రమేశ, గుంత సతీశ్, గుంత కృష్ణ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మంథని, సెప్టెంబర్ 1: పట్టణంలోని ప్రభుత్వ సామాజిక వైద్యశాలలో వాసవి క్లబ్, వనితా వాసవి క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కేసీ గుప్తా జయంతిని పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయగా పలువురు యువకులు రక్తాన్ని దానం చేశారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్, వనితా వాసవి క్లబ్ నాయకులు రామలింగేశ్వర్, మౌనిక, ఆదిత్య, కిషోర్, కొమురవెల్లి ఉదయ్ భాస్కర్, దొంతుల ఓం ప్రకాష్, రాజేష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మేడగోని వెంకటేశ్‌లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ లఘుచిత్రంగా 'మతమా..మానవత్వమా..'

కోల్‌సిటీ, సెప్టెంబర్ 1ః గోదావరిఖనికి చెందిన సీనియర్ కళాకారుడు దామెర శంకర్ దర్శకత్వం వహించి నిర్మించిన 'మతమా..మానవత్వమా' అనే షార్ట్ ఫిల్మ్ ఉత్తమ చిత్రంగా ఎంపికైంది. ఈమేరకు హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్స్‌లో వీకేఆర్ ఎంటర్‌టైన్‌మెంట్, 24 ఫ్రేమ్స్ మీడియా ఆధ్వర్యంలో నిర్వహించిన షార్ట్ ఫిలిం అండ్ ఫోక్ సాంగ్స్ అవార్డు–2023 ఫంక్షన్‌లో దామెర శంకర్‌కు బెస్ట్ షార్ట్ ఫిలిం అవార్డును అందజేశారు. మతం కన్నా మానవత్వం మిన్న అనే కథాంశంతో స్వీయరచన, దర్శకత్వంలో స్థానిక దర్శకుడు దామెర శంకర్ ఈ లఘు చిత్రం నిర్మించారు. నిర్వాహకులు అతిథుల చేతుల మీదుగా ఈ సినిమా బృందానికి అవార్డును బహూకరించి అభినందించారు.

రిటైర్డ్ ఉపాధ్యాయురాలికి సన్మానం

గోదావరిఖని, సెప్టెంబర్ 1: రిటైర్డ్ టీచర్ వనజకు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయురాలుగా సేవలు అందించి ఎంతోమంది పిల్లలకు ఉన్నతమైన విద్యను బోధించి వారికి విద్యా బుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయురాలు వనజను సన్మానించారు.

'అనభేరి' స్ఫూర్తితో పోరాడాలి

పెద్దపల్లి టౌన్, సెప్టెంబర్ 1:నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన అనభేరి ప్రభాకర్‌రావు పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకొని పోరాటాలు రూపొందించాలని వారసుల సంఘం జిల్లా అధ్యక్షుడు బాలసాని వెంకటేశంగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సుభాష్ చంద్రబోస్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. సమరయోధుల సంఘం ఆధ్వర్యంలో ఆశయ సాధనకు నిత్యం పాటుపడుతామని తెలిపారు. ఇక్కడ వెంకటేశ్వర్లు, ఆనందరావు, శ్రీనివాస్, గోపీ, రమేశ్‌బాబు, కృష్ణ, రాము పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం

అంతర్గాం, సెప్టెంబర్ 1: మండలంలోని పొట్యాల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2003–04 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు 20 యేళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం ద్వారా కలుసుకున్నారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన పూర్వ విద్యార్థులు తమకు విద్య నేర్పిన గురువులు కానుగంటి రాజమౌళి, రేవతి, సురేందర్, రమాదేవి, సౌభాగ్య, శ్రీకాంత్, వాసు, వాగ్దేవి, సరిత, సురేశ్‌ను ఆహ్వానించి పూల మాల, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు. విద్యార్థులను గుర్తించడం ఉపాధ్యాయులకు కూడా కష్టతరమైంది. కాగా, చిన్నప్పటి జ్ఞాపకాలతో ఈ ఆత్మీయ సమ్మేళనం ఆనందోత్సాహాల మధ్య సాగింది. సంధాన కర్తలుగా ఎనగందుల శ్రీకాంత్, మెండె రమేశ్, నల్లపు మహేందర్, సత్తం చందు, అశోక్, భరత్, మమత, శైలజ, రజిత, సుమలత, రాధిక, సతీశ్ తోపాటు 46 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు

ఒకే రోజు ముగ్గురు మృతి.. కాల్వశ్రీరాంపూర్ లో విషాదం

కాల్వశ్రీరాంపూర్, సెప్టెంబర్1:కాల్వశ్రీరాంపూర్‌లో ఆదివారం ఒకే రోజు ముగ్గురు మృతి చెందడంతో విషాదం నెలకొంది. మెట్టు సమ్మక్క అనే మహిళ గుండె పోటుతో మృతి చెందింది. ఇటీవల తూండ్ల శ్రీనివాస్ అనే యువకుడు ఓదెల మండలంలోని కొలనూర్ లో తన ఒంటిపై కిరోసిన్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ దవాఖాన కు తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. మరో యువకుడు చెప్యాల పవన్ మీర్జంపేట లో బిల్ కలెక్టర్ గా పని చేస్తూ, స్వగ్రామమైన కాల్వశ్రీరాంపూర్ కు వస్తుండగా కొత్తపల్లి–మల్యాల వద్ద నక్కల ఒర్రెలో పడి గల్లంతయ్యాడు. దీంతో కాల్వశ్రీరాంపూర్ లో విషాదచాయలు అలుముకున్నాయి. కాగా బాధిత కుటుంబాలను పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు పరామర్శించారు.

కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి

పాలకుర్తి, సెప్టెంబర్1: పంచాయతీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ పాలకుర్తి మండల పంచాయతీ వర్కర్ల సమావేశం బసంత్‌నగర్ కోదండరామాలయంలో ఆదివారం జరిగింది. గ్రామపంచాయతీ కార్మికులపెండింగ్ వేతనాలు విడుదల చేయాలని సిబ్బంది డిమాండ్ చేశారు. గతంలో 34 రోజులు సమ్మె చేసి కాంగ్రెస్‌పార్టీకి మద్దతు ప్రకటించినందుకు 9 నెలలుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తుందన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సీపెల్లి రవీందర్, మండల అధ్యక్షుడు రామస్వామి, నాయకులు కట్లస్వామి, కర్రావుల కృష్ణయ్య, గద్దల నరసింహారాజు, సారయ్య, కనుకయ్య, బెక్కం మల్లేషం, సమ్మయ్య, స్వరూప, సాయి, గణేష్, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న కోలేటి దామోదర్

ఎస్‌బీఐ చైర్మన్‌ను కలిసిన కోలేటి

గోదావరిఖని, సెప్టెంబర్ 1: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు నూతన చైర్మన్‌గా ఇటీవల నియమితులైన శ్రీనివాసులు శెట్టిని ముంబాయిలోని ఎస్‌బీఐ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు .పుష్పగుచ్చం అందించి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వాసవి గ్రూపు చైర్మన్ విజయ్‌కుమార్, వెంకటేశ్వర్లు, గందె సుధాకర్, సీఏ రాజేశ్ ఉన్నారు.

ఆదివరాహస్వామికి ప్రత్యేకాభిషేకాలు

రామగిరి :గోదారంగ నాయక స్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

కమాన్‌పూర్, సెప్టెంబర్ 1 : మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీ ఆదివరాహ స్వామికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. శ్రావణమాసం చివరి ఆదివారం కావడంతో భక్తులు పై సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. స్వామి వారికి ముడుపులు కట్టారు. వేడుకున్నారు. అనంతరం భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించగా, పలువురు దాతలు అన్నదానం చేశారు. భారీ వర్షాన్ని సైతం లెక్క చేయకుండా అధిక సంఖ్యలో ప్రజలు హాజరై భక్తిని చాటుకున్నారు.

గోదా రంగనాయక ఆలయంలో పూజలు

రామగిరి, సెప్టెంబర్ 1: మండలంలోని లద్నాపూర్ గ్రామంలో ఆదివారం శ్రీ గోదా రంగనాయక స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణ మాసం చివరి వారం శ్రీ గోదా రంగనాయక స్వామి విగ్రహానికి నిత్యపూజలు, అభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తుంది. అందులో భాగంగా ఆదివారం స్వామివారిని ప్రత్యేక రథంపై గ్రామంలో ఊరేగింపుగా పల్లకీ సేవ, మహిళల కోలాట నృత్యాలతో వైభవంగా నిర్వహించారు. భక్తులు దారి పొడవునా మంగళ హారతులతో స్వామివారికి నీరాజనాలు పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొల్లపల్లి స్వామి గౌడ్, అర్చకులు సముద్రాల శ్రీనివాస చార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆయన సేవకు 'సెల్యూట్'

కోల్‌సిటీ, సెప్టెంబర్ 1: మనిషి గాంభీర్యం..కానీ మనసు మాత్రం సేవాగుణం.. ఆయనలోని సేవకు ప్రతి ఒక్కరూ సెల్యూట్ కొడుతున్నారు. గతంలో రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో పని చేసి ప్రస్తుతం కరీంనగర్‌లో ఏఆర్ ఏసీపీగా పని చేస్తున్న ఎస్.సుందర్ చాలా కాలంగా అనాథ పిల్లల ఆకలి తీరుస్తున్నాడు. దీనిలో భాగంగా గోదావరిఖని గాంధీనగర్‌లోని ఎండీహెచ్ డబ్ల్యూఎస్ అనాథ పిల్లల ఆశ్రమంకు పిల్లలకు అన్నదానం నిమిత్తం ఆదివారం రూ.5వేలు సాయం అందజేశారు. గతంలో ఇక్కడపని చేసిన సమయంలో ఈ ఆశ్రబమాన్ని సందర్శించిన సందర్భంలో అనాథ పిల్లలను చూసి చలించిన ఆయన ప్రతి నెల తన జీతంలో కొంత భాగంకేటాయిస్తున్నారు. ప్రతి నెల ఆశ్రమానికి క్వింటాలు బియ్యం అందజేస్తున్నారని ఆశ్రమ నిర్వాహకుడు రాజయ్య పేర్కొన్నారు. క్రమం తప్పకుండా తమ ఆశ్రమంకు పిల్లల ఆకలి తీర్చేందుకు బియ్యం అందజేస్తున్న ఆయనకు ఎల్లవేళలా రుణపడి ఉంటామని రాజయ్య, ఆశ్రమ పిల్లలు కృతజ్ఞతలు తెలిపారు.

ఇది పెద్దపల్లి పోలీస్ స్టేషనే?

ఈ ఫోటోలోని కట్టడం ఎఫ్‌టీఎల్ పరిధిలో అనుకుంటే పొరపాటే. అది పెద్దపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న పెద్దపల్లి పోలీస్ స్టేషన్. చిన్న పాటి కుంటను తలపిస్తున్నది. ఆదివారం కురిసిన వర్షంతో పోలీస్ స్టేషన్‌లోకి భారీ వరద వచ్చి చేరింది. పోలీస్ స్టేషన్ ముందు కూడా మోకాళ్లోతు నీళ్లు చేరటంతో పాదాచారులు, వాహదారులు ఇబ్బందులు పడ్డారు.

- పెద్దపల్లి, సెప్టెంబర్1

ముత్తారం : ఓడేడ్ లో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్ఐ నరేశ్

అప్రమత్తంగా ఉండాలి

ముత్తారం, సెప్టెంబర్ 1: భారీ వర్షాల నేపథ్యంలో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ గోపతి నరేశ్ సూచించారు. మండలంలోని మానేరు పరివాహక ప్రాంతాలను ఆదివారం తన సిబ్బందితో కలిసి సందర్శించారు. మానేరులో ప్రవహిస్తున్న వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రధాన లో తట్టు ప్రాంతాలు, మానేరు పరివాహక ప్రాంత ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనవసరంగా ఎవరూ కూడా ఇండ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. చేపల వేటకు వెళ్లొద్దన్నారు. ఎక్కడైన కరెంటు తీగలు తెగి పడితే వాటి దగ్గరకి వెళ్లకుండా విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలని కోరారు. అత్యవసర పరిస్థితి ఉంటే 100కు కాల్ చేయాలని సూచించారు. ఇక్కడ సిబ్బంది అశోక్ , గోపాల్ పాల్గొన్నారు.

జూలపల్లి, సెప్టెంబర్ 1 : వరుసగా కురుస్తు భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ శ్రీధర్ సూచించారు. మండల కేంద్రంలో ఆదివారం ఆయన మాట్లాడారు. అత్యవసర పరిస్థితుల్లో తప్ప ఇంటి నుంచి బయటకు వెళ్లవద్దని తెలిపారు. మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని తెలిపారు. గండిపడిన చెరువులు, కుంటల వద్దకు వెళ్లవద్దని, నీటి మడుగులు, నాలాలు వద్దకు చేరుకోవద్దని వివరించారు. శిథిలావస్థకు చేరిన ఇండ్లు, మట్టి గోడలు గుర్తించాలని, ప్రమాదాల నివారణపై ప్రతి ఒక్కరూ స్పందించాలని తెలిపారు. ఎప్పటికప్పుడూ సమాచారం ఇచ్చి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ కూలీ మృతి

కమాన్‌పూర్, సెప్టెంబర్ 1: జూలపల్లి గ్రామ శివారులో గల పంట పొలంలో ఆదివారం వ్యవసాయ కూలీ ఇలాసారం కిరణ్ (37) మృతి చెందాడు. పొలం పనుల కోసం వెళ్లగా, అక్కడే సొమ్ము రావడంతో పంట పొలంలో పడి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కమాన్‌పూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఆసిఫాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన కిరణ్ 20 ఏళ్లుగా జూలపల్లి గ్రామంలో రఘుపతి దగ్గర ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గతంలో నుంచే ఇతనికి సొమ్ము వా ఉండటంతో మందులు వాడుతున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. కిరణ్ భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.